పాడి.. సంరక్షణతో రాబడి

- వేసవిలో పశు సంరక్షణపై అప్రమత్తత
- వడదెబ్బ నుంచి రక్షణ చర్యలు తప్పనిసరి
- నిర్లక్ష్యం వహిస్తే మృత్యువాత – పశువైద్యాధికారులు


పాకలో కట్టిన పశువులు

అనకాపల్లి రూరల్ : వేసవిలో ఎండల తీవ్రత నుంచి పశువులను కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు తప్పనిసరి. మండుటెండలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉష్ణతాపంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి ఉండదు. ఆ సమయంలో సరైన రక్షణ చర్యలు చేపట్టకపోతే ఎండ తీవ్రత వలన పశువులకు వడదెబ్బ తగిలే అవకాశముంది. తద్వారా పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడమే కాకుండా, పశువులు మృత్యువాత పడే ప్రమాదం ఉంది.

యాజమాన్య పద్ధతులు ఇలా..

సాధారణంగా వేసవిలో అధిక ఉష్ణోగ్రతల వలన పాడి పశువులు ఒత్తిడికి, అసౌకర్యానికి లోనవుతాయి. దీంతో మేత తీసుకోవడం తగ్గిపోతుంది. తద్వారా పాల దిగుబడి, పాలలో వెన్న శాతం తగ్గిపోతుందని పశువైద్యాధికారులు చెప్తున్నారు. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పశువుల సంరక్షణకు పాటించే రోజువారీ యాజమాన్య పద్ధతుల్ని సూచిస్తున్నారు.

- గాలీ వెలుతురు బాగా ప్రవేశించేలా పశువులకు ప్రత్యేక కొట్టం, షెడ్డు, తాటి కమ్మల పాక ఏర్పాటు చేసుకోవాలి.
- షీట్లు వేసిన షెడ్డుపై 8–10 సెం.మీ. మందంతో ఎండు గడ్డిని పరిచి రోజుకు రెండు మూడుసార్లు నీటితో తడపాలి.
- షెడ్డుకు ఇరువైపులా గోనె సంచులను కట్టి నీటితో తడపడం ద్వారా షెడ్డు లోపల ఉష్ణోగ్రతతో పాటు వేడి గాలుల తీవ్రతను తగ్గించవచ్చు. వీలైతే నీటి స్ప్రింక్లర్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవచ్చు.
- పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా, పరిశుభ్రమైన నీటిని అందించాలి.
- పచ్చ గడ్డి, ఎండు గడ్డి సమృద్ధిగా అందించాలి.
- పశువులపాక, షెడ్డు లేదా కొట్టం చుట్టూ అవిసె, మునగ తదితర నేడనిచ్చే చెట్లను పెంచడం వలన అవి పశుగ్రాసంగా కూడా ఉపయోగపడతాయి.
- ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో పశువులను బయటకు తీసుకెళ్లరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే మేతకు తీసుకెళ్లాలి.
- పశువులు వేసవిలో ఎక్కువ నీటిని తాగడం వలన మేత తక్కువగా తీసుకుంటాయి. అందుచేత పోషక విలువలు ఎక్కువగా ఉన్న మేతను అందించాలి.
- ఉదయం పచ్చి మేతను, సాయంత్రం ఎండు మేతను అందించాలి. చాప్ కట్టర్‌ను వాడటం వలన మేత వృథాను అరికట్టవచ్చు.
- పచ్చిమేత అందుబాటులో లేనపుడు సైలేజ్, టీఎంఆర్, అజొల్లాను వాడవచ్చు.
- మినరల్ మిక్చర్, ఉప్పును దాణాలో కలిపి పెట్టుకోవాలి.
- చూడికి సిద్ధంగా ఉన్న పశువులను ఎండలో మేతకు పంపరాదు. ఉష్ణతాపం వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతిని పునరుత్పత్తి మీద ప్రభావం చూపుతుంది.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు

పశువులకు వడదెబ్బ తగిలినపుడు గుర్తించేందుకు ముందస్తుగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. పశువు అధిక శరీర ఉష్ణోగ్రతకు గురవడం, అధిక శ్వాస, నాడి, గుండె వేగంగా కొట్టుకోవడం, చొంగ ఎక్కువగా కార్చడం కనిపిస్తాయి. చర్మంపై వెంట్రుకలు బిరుసుగా తయారవుతాయి. వడదెబ్బ తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు స్పృహ కోల్పోయి ప్రాణ నష్టం జరగవచ్చు. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకువచ్చి, శరీరంపై నీళ్లు చల్లి వెంటనే పశు వైద్యుణ్ని సంప్రదించి తగిన చికిత్స అందించాలి. తేలికగా జీర్ణం అయ్యే దాణా, గంజిలో ఉప్పు కలిపి ఆహారంగా ఇవ్వాలి. వైద్యులను సంప్రదించి డెక్రోజ్ సెలైన్ ద్రావణాన్ని రక్తనాళంలోకి పంపాలి. విటమిన్ ఏ, డీ సూదిమందులను విటమిన్ సీ, బీ కాంప్లెక్స్ సూది మందులను వేయించాలి. రోజుకు 40 లీటర్ల నీటిని తాగించాలి. పచ్చిమేతను అందించడం మంచిది.

అనకాపల్లి ఏడీ పరిధిలో పాడి పశువుల సంఖ్య

మండలం	ఆవులు	గేదెలు
అనకాపల్లి	8748	13676
కశింకోట	7096	10348
మొత్తం	15844	24024

జాగ్రత్తలు తప్పనిసరి



వేసవిలో రైతులు పశువుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. పశువుల పాక వద్ద పేడ, పెంట కుప్పలపై వాలే దోమలు, ఈగల నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి. పచ్చ గడ్డి సదుపాయం లేని రైతులు పాతర వేసిన యూరియా గడ్డిని అందిస్తే ఫలితం ఉంటుంది. ఈ గడ్డిలో 45–55 శాతం వరకూ తేమ ఉంటుంది. దీనిని మేతగా అందించడం వలన శరీర ఉష్ణోగ్రత తగ్గి పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంది.

– బి.సౌజన్య, ఏడీ, పశుసంవర్ధక శాఖ, అనకాపల్లి

క్లుప్తంగా

నడిమివలసలో సమస్యలు పరిష్కరిస్తాం


బాధిత గిరిజనులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డుంబ్రిగుడ: అరమ పంచాయతీ నడిమివలసలో వాంతులు, విరోచనాలతో బాధపడుతున్న చిన్నారులను వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే పాల్గుణ ఆదేశాల మేరకు ఇక్కడ చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యేతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి గోపాల్, సీనియర్ నాయకులు బాక సింహాచలం, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, మల్లేష్, గణపతి, శ్రావణ్ పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి వినతి

తుమ్మపాల : రేషన్ సరుకుల(ఎండీయూ) వాహన ఆపరేటర్ల జీతాల నుంచి ఎటువంటి సమాచారం లేకుండా బ్యాంకు ఆఫ్ బరోడా అధికారులు బీమా పేరిట రూ.19 వేల నుంచి రూ.26 వేల వరకు కట్ చేయడంతో పాటు, తమ సమస్యల పరిష్కారం కోరుతూ జేసీ కల్పనాకుమారికి ఎండీయూ ఆపరేటర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఎండీయూ వాహనాలకు గిడ్డంగుల నుంచి అందించే సరకు(బస్తాల) తూకంలో తేడాలు లేకుండా ఇవ్వాలని ఏడాది క్రితం ప్రభుత్వం జీవో ఇచ్చినా, అధికారులు నేటికీ అమలు చేయట్లేదని ఆరోపించారు. ఐసీడీఎస్, ఎండీఎం కమిషన్ ఆరు నెలల నుంచి బకాయి ఉందన్నారు. బ్యాంకు నుంచి సకాలంలో వాహనాల ఇన్సురెన్స్ కాపీలు ఇవ్వక, వాహనాల ఫిట్‌నెస్ గడువు ముగిసి అదనపు రుసుము చెల్లించాల్సి వస్తోందన్నారు. ఆపరేటర్లు, హెల్పర్లకు ప్రమాదబీమా వర్తింపజేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ జట్టి శ్రీను, వైస్ ప్రెసిడెంట్ ఇంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బంగారి లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

వై.రామవరం: చవిటిదిబ్బలు గ్రామంలో మూడో విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు శనివారం మధ్యాహ్నం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారన్నారు. మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తులు

అరకులోయ రూరల్: యండపల్లివలస కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు ఆన్‌లైన్లో ఈ నెల 27 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ స్వాతి సుశీల శుక్రవారం తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థినులతోపాటు పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లు భర్తీ చేస్తామన్నారు. మరింత సమాచారం కోసం 6302372851 సంప్రదించాలని సూచించారు.

ఉత్తమ చదువుతో.. ఉన్నత స్థాయి

తుమ్మపాల : గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు చాలా చురుగ్గా ఉంటారని, పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సురేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని మహాత్మా జ్యోతీబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సమయాన్ని వృథా చేయకుండా ఏకాగ్రతతో చదవాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకోవాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉండాలన్నారు. తాను కూడా సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకుని, ఐదు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైనట్టు తెలిపారు. మన చదువే ఉన్నతంగా తీర్చిదిద్దుతుందన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని వారిలో స్ఫూర్తి నింపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శి కృష్ణమోహన్ మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తర్ఫీదునిచ్చినట్టు తెలిపారు.

నోటీసులపై ఆందోళన చెందొద్దు

రంపచోడవరం: పట్టణంలోని కొంత మందికి గృహాలు తొలగింపునకు సంబంధించి అటవీ శాఖ నోటీసులు ఇవ్వడంపై శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మికి మొరపెట్టుకున్నారు. రంపచోడవరంలోని దర్గవీధి, వాటర్ ట్యాంకు వీధి, వాల్మీకిపేట ఏరియా గ్రామస్తులు కలిశారు. దీనిపై ఆమె స్పందించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నోటీసుల విషయమై ఎవరూ భయపడవద్దన్నారు. అన్ని తాము చూసుకుంటామని హామీ ఇచ్చారు. వీరి వెంట రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పండా రామకృష్ణదొర తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్ష కేంద్రం పరిశీలన


యార్లగడ్డలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ తాతారావు

వై.రామవరం: మండలంలోని యర్లగడ్డ గ్రామ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ ఎ.తాతారావు పరిశీలించారు. అక్కడ సౌకర్యాలను పరిశీలించి పరీక్షలు ప్రశాంతంగా, పకడ్బందీగా నిర్వహణకు హెచ్ఎం మద్దికొండ ఝాన్సీరాణికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇక్కడ 146 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకర్ పాల్గొన్నారు.

గిరిజన యువత క్రీడల్లో రాణించాలి


విజేత జట్టుకు నగదు, షీల్డు అందజేస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: గిరిజన యువత చెడు మార్గాలను వీడి క్రీడల్లో రాణించాలని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ఆకాంక్షించారు. శ్రీరామనవమి ఉత్సవాలు పురస్కరించుకుని మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు ఆధ్వర్యంలో జి.మాడుగులలో నిర్వహించిన మెగా వాలీబాల్ క్రీడల్లో విజేత జట్టుకు గురువారం రాత్రి ఆమె నగదు షీల్డు ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన కొమ్ములమామిడి జట్టుకు రూ.10 వేలు, షీల్డు, ద్వితీయ బహుమతి పెదవలస జట్టు రూ.5 వేలు, షీల్డు అందుకున్నాయిజ. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఎం. సింహాచలంరాజు, కార్యదర్శి గసాడి రెడ్డిబాబు, వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు, వాలీబాల్ ఆర్గనైజర్లు ఎం రామకృష్ణంరాజు, ఎం నారాయణరాజు, ఎంపీటీసీ సభ్యుడు గబ్బాడి సన్యాసిదొర, రైతు నేస్తం సంస్థ సీఈవో లక్ష్మణ్ పాల్గొన్నారు.

మానసిక రోగులకు ఆరు రకాల మందులు

- మానసిక వైద్య నిపుణుడు రామారెడ్డి


రోగికి కౌన్సెలింగ్ ఇస్తున్న డాక్టరు రామారెడ్డి

రాజవొమ్మంగి: మానసిక రోగుల కోసం ప్రభుత్వం ఆరు రకాల మందులను ప్రతి పీహెచ్‌సీలో అందుబాటులోకి తీసుకొచ్చిందని మానసిక వైద్యనిపుణుడు రామారెడ్డి తెలిపారు. వీటిని వాడితే ఎటువంటి మానసిక రోగమైనా తగ్గి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ముగ్గురు మానసిక వ్యాధితో బాధపడుతున్న వారికి ఆయన శుక్రవారం కౌన్సెలింగ్ ఇచ్చి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

రోగి ఇంటికి వెళ్లి కౌన్సెలింగ్

రాజవొమ్మంగి శివాలయం వీధిలో మానసిక సమస్యతో బాధపడుతూ చిక్కిశల్యమైన వివాహిత రాజారత్నం (30) ఇంటికి వెళ్లి ఆమెకు మానసిక వైద్యనిపుణుడు రామారెడ్డి కౌన్సెలింగ్ ఇచ్చారు. స్థానికులు కొంత మంది ఆ మహిళ దీనావస్థను వివరించడంతో ఆమెను స్వయంగా పరీక్షించారు. ఏ సమస్యా లేదని ధైర్యం చెప్పారు. అవసరమైన మందులు భర్త అప్పారావుకు అందజేశారు. వాతలు పెట్టి భూత వైద్యం చేయించడం మంచి పద్ధతి కాదన్నారు. రాజవొమ్మంగితోపాటు గంగరవరం పీహెచ్‌సీలో ముగ్గురు, ఎల్లవరం పీహెచ్‌సీలో పది మందికి చికిత్స అందజేసినట్లు రామారెడ్డి తెలిపారు.

డ్రగ్స్ బారిన పడితే అంధకారమే


మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రశేఖర్

చోడవరం రూరల్: విద్యార్థి దశలో డ్రగ్స్‌తో పట్టుబడితే జీవితం అంధకారమవుతుందని ఎక్సైజ్ ఎస్‌ఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ కారణంగా పట్టుబడిన విద్యార్థులు తీవ్రమైన శిక్షలు ఎదుర్కోవాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, భవిష్యత్‌ను కోల్పోతారన్నారు. ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ డ్రగ్స్ యువత జీవితాలు సర్వనాశనం చేస్తుందన్నారు. ఐక్యూఏసీ కేంద్రం, ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సెటివ్స్ నూకరాజు, ఐక్యూఏసీ ప్రతినిధి జి.వి.వి.ఎస్.ప్రసాద్‌బాబు, ఎన్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, లక్ష్మి, పిచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆరోగ్య సంరక్షణకు చర్యలు


వైద్యాధికారి రాజేశ్వరి

ఎస్.రాయవరం: వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాజేశ్వరి తెలిపారు. పెనుగొల్లు పీహెచ్‌సీలో శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలో వేసవి ఎండలు ముదురుతున్నాయని, పనుల నిమిత్తం వెళ్లాల్సి వచ్చినవారు తగు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి అవసరమైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. రేవుపోలవరంలో కొందరు కిడ్నీ, క్యాన్సర్ రోగాలతో బాధపడుతున్న విషయం తమ దృష్టిలో ఉందన్నారు. గ్రామస్తుల కోరిక మేరకు వైద్య శిబిరం నిర్వహించినట్టు తెలిపారు. అయితే కిడ్నీ, క్యాన్సర్ రోగులు ఇప్పటికే అవసరమయిన చికిత్స తీసుకుంటున్నారని పేర్కొన్నారు. కొత్తగా వ్యాధి లక్షణాలు ఉన్న వారు పీహెచ్‌సీలో సంప్రదిస్తే సత్వర వైద్యం అందిస్తామన్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇళ్ల వద్దకు సైతం వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. ఏప్రిల్లో మరిన్ని స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు.

దుర్గమ్మ తల్లి దేవాలయం ప్రారంభం


దుర్గమ్మకు పూజలు చేస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : మండలంలోని పెంటకోట బీచ్‌లో దుర్గమ్మ తల్లి దేవాలయాన్ని ఉత్తరాంధ్ర రైతు విభాగం ఇన్‌చార్జ్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు శుక్రవారం ప్రారంభించారు.అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధనను ప్రారంభించారు. సప్తగిరి హేచరిస్ అధినేత సత్తిసూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ చేపల నాగమణి తాతాజీ, ఉపసర్పంచ్ చిక్కాల బాబు, జిల్లా పబ్లిక్ వింగ్ చైర్మన్ దగ్గుపల్లి సాయిబాబా, నాయకులు పాల్గొన్నారు.

అట్టుడికిన గంగవరం పోర్టు

- జీపీఎస్ కార్మికుల ఆందోళనతో ఉద్రిక్తత
- కార్మికుడి ఆత్మాహత్యాయత్నంతో వేడెక్కిన వాతావరణం
- పోలీసుల రంగప్రవేశం
- చర్చలకు ఆహ్వానించిన యాజమాన్యం


ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన దిగిన పేర్ల నూకరాజు


ధర్నాలో కూర్చున్న కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను

పెదగంట్యాడ: గంగవరం పోర్టు అట్టుడికింది.. జీపీఎస్ కార్మికుల ఆందోళనతో దద్దరిల్లింది.. పోర్టు యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తింది. జీతాలు పెంచి న్యాయం చేయాలంటూ పెద్ద ఎత్తున కార్మికులు నినాదాలు చేశారు. యాజమాన్య తీరుతో విసిగిపోయిన పేర్ల నూకరాజు అనే ఉద్యోగి ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డాడు. తోటి కార్మికుల సమక్షంలోనే ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడంతో వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ సమాచారం అందుకున్న న్యూపోర్టు పోలీసులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటు చేసుకున్నాయి. హార్బర్ ఏసీపీ శిరీష, న్యూపోర్టు సీఐ రాము, స్టీల్‌ప్లాంట్ సీఐ శ్రీనివాసరావు హుటాహుటిన అక్కడకు చేరుకుని.. ఉద్యోగులను శాంతింపజేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.

జీతాలు పెంచాలని కోరుతూ ఆందోళన

తమకు జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులంతా శుక్రవారం ధర్నాకు దిగారు. కార్మికుల ఆందోళనకు మద్దతుగా 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను మద్దతు ఇచ్చారు. వారితో కలసి ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీపీఎస్ ఉద్యోగులు మాట్లాడుతూ 2009లో పోర్టులో ఉద్యోగాలు వచ్చాయని, అప్పట్లో నెలకు రూ.4,732 చొప్పున జీతాలు ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఒక్కో ఉద్యోగికి రూ.8300 నుంచి 14,600 వరకూ మాత్రమే జీతాలు పెరిగాయన్నారు. ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి రూ.3700 మాత్రమే బేసిక్ ఇస్తున్నారన్నారు. 14 ఏళ్లలో ఇంత తక్కువగా జీతాలు పెంచడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై పలుమార్లు పోర్టు యాజమాన్యం, లేబర్ కమిషనర్‌కు వినతిపత్రాలు సమర్పించామని గుర్తు చేశారు. గంగవరం పోర్టు కోసం భూములు త్యాగం చేసిన తమకు ఇలా అన్యాయం చేయడం సరికాదన్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబాలను ఎలా నెట్టుకువస్తామని నిలదీశారు. ఆందోళనలు చేస్తే కార్మికులను అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు.

రూ.36వేలు వేతనం ఇవ్వాలి

పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. అక్రమంగా ఉద్యోగాల నుంచి తొలగించిన గంటిపల్లి లక్ష్మయ్య, కదిరి భూలోకరావు, కారి అప్పారావుతో పాటు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. ఏటా నెల జీతం బోనస్, 600 మంది కార్మికుల్లో 550 మంది మాత్రమే ఉన్నారని, మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ప్రత్యేక మెడికల్ పాలసీని ప్రవేశ పెట్టాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్, తక్షణమే నష్టపరిహారం ప్యాకేజీ, జీపీఎల్, జీపీఎస్ మధ్య అంతరాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు.

చర్చలకు ఆహ్వానం

కార్మికుల ఆందోళన నేపథ్యంలో యాజమాన్యం దిగి వచ్చింది. జీతాల విషయంలో చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం చర్చలకు ఆహ్వానించారు. యాజమాన్యం తరఫున పోర్టు మాజీ సీఈవో సాంబశివరావుతో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కార్మిక సంఘాల నాయకులు జీవీ సత్యనారాయణ, కొవిరి అప్పలరాజు, జగన్, కనకరాజు తదితరులు చర్చించారు. వచ్చే బుధవారం తగిన నిర్ణయం తీసుకుంటామని యాజమాన్య ప్రతినిధులు వెల్లడించారు.

చర్చలు ఫలిస్తే సరే..



పోర్టు యాజమాన్యంతో చర్చలు ఫలిస్తే సరేసరి.. లేకపోతే ఆందోళ ఉధృతం చేస్తాం. ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా యాజమాన్య వైఖరిలో మార్పులేదు. ఈ సారి మాత్రం ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉన్నాం.

– కదిరి పోలరాజు, జీపీఎస్ ఉద్యోగి

అన్యాయం చేస్తే సహించం



14 ఏళ్లుగా గంగవరం పోర్టు యాజమాన్యం జీపీఎస్ ఉద్యోగులకు అన్యాయం చేస్తోంది. ఈసారి మాత్రం డిమాండ్లు పరిష్కరించకపోతే సహించేది లేదు. అన్ని సంఘాలతో కలసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం.

– కొవిరి అప్పలరాజు, కార్మిక సంఘ నాయకుడు

నేర నియంత్రణపై దృష్టి పెట్టండి


సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి: నగరంలో క్రైం రేట్ మరింత తగ్గే విధంగా పనితీరు ప్రదర్శించాలని నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరును సీపీ పరిశీలించారు. క్రైం, ట్రాఫిక్ విభాగాలపై సమీక్షించారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని, వాటిని సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలను తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్లకు సీనియర్ అధికారుల సందర్శనపై ఆరా తీశారు. సైబర్ క్రైం వారియర్స్ శిక్షణపై ఆరా తీసి పలు సూచనలు చేశారు. మహారాణిపేట ప్రాంతంలో రామజోగిపేటలో మూడు అంతస్తుల భవనం కూలిన ఘటనలో వెంటనే స్పందించి ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించిన పోలీస్ సిబ్బంది ప్రశంసా పత్రాలు అందజేశారు. డీసీపీ-1 సుమిత్ సునీల్ గరుడ్, డీసీపీ(క్రైం) జి.నాగన్న, డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మన్యం ధీరుడు సీతారామరాజు షూటింగ్ ప్రారంభం


అమ్మవారిపై తొలిషాట్ చిత్రీకరిస్తున్న చిత్ర యూనిట్

చీడికాడ: మండలంలోని కోనాం భోగొండమ్మ గుడిలో మన్యం ధీరుడు సీతారామురాజు చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభమయింది. ఆర్‌వీవీ మూవీస్ బేనర్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాత, సీతారామరాజు పాత్రధారి ఆర్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. ముందుగా స్క్రిప్ట్‌ను అమ్మవారి పాదాల వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్‌సీపీ రైతు విభాగం అధ్యక్షుడు యర్రా అప్పారావు కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మొదటి షాట్ అమ్మవారిపై తీశారు. చిత్ర దర్శకుడు నరేష్ మాట్లాడుతూ చిత్రం మొత్తం కోనాం పరిసరాల్లోనే చిత్రీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు సుంకర శ్రీనివాసరావు, కిముడు సన్యాసిరావు, సలుగు భీమునాయుడు, కార్యకర్తలు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.